## ఈవారం కథ

# శాడిజం

కెమెరా విజయకుమార్

"'ఏరా శ్రీనూ! ఎక్కడికో వెళతానన్నావని చెప్పింది మీ అమ్మ" మొక్కలకు నీళ్ళు పెడుతున్న వసంతరావు భార్య, గేటు తీసుకొని లోపలికి వస్తున్న శ్రీను నడిగింది.

"అసలీ ఆదివారం గార్డెన్ పార్టీకెళ్ళాల్సిందండి, కాని మా క్లాస్ లీడరు కేన్సిల్ చేశాడు" ఆశాభంగం అంతా శ్రీను ముఖంలోనే కదలాడింది.

"ఎందుకూ...?" ఎంక్వైరీగా అడిగింది.

"మా క్లాసులో నచ్చడోళ్ళ కుర్రాళ్ళు చదువుతున్నారు. ఆళ్ళు కూడా డబ్బులిచ్చి గార్డెన్ పార్టీకి వస్తామన్నారు. ఆళ్ళను రావద్దని చెబితే యింటం లేదట, అందుకని మొత్తం పార్టీనే కేన్సిల్ చేశాడు మా లీడరు" అని చెప్పాడు మున్సిపాలిటీ బళ్ళో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీను.

శ్రీను వసంతరావు ఇంట్లో పనిచేసే లక్ష్మమ్మ కొడుకు. వసంతరావు భార్య కొత్తగా కొన్న పూలకుండీలలో మట్టిని వేసి కొత్త మొక్కలు వేయడానికి సహాయపడతాడని ఆదివారం శ్రీనును తీసుకురమ్మని చెప్పింది.

వరండాలో కూర్చుని పేపరు చూస్తున్న వసంతరావు శ్రీను మాటలు విని షాక్ తిన్నాడు. ఎదురుగా వున్న పూలకుండీల మీద బొమ్మలు తలలాడిస్తున్న పాము పడగల్లా కనిపించాయతనికి.

కారణమేమిటో సరిగ్గా తెలియదు కానీ, కార్తీక మాసం- వనభోజనాలు వసంతరావుకొక 'అబ్సెషన్'. ప్రతిఏడాది ఏదోకరీతిని మనస్సు చికాకు పరుస్తూనే ఉంటుంది.

వసంతరావు ఆఫీసు స్టాఫ్ వనభోజనాలు పెట్టుకుని అతనిని రమ్మన్నారు. రాలేదని "ఏ పనికి కలసిరాడు, ఒంటిపిల్లి రాకాసి" అని వెనక తిట్టని వారు లేరు. సోమవారం ఆఫీసుకెళ్ళగానే అందరూ వరుసగా వసంతరావు దగ్గరకొచ్చి బాధలు చెప్పకొనేవారే.

వసంతరావుతో ఏ విషయం చెప్పినా స్విస్ బ్యాంకులో వేసినట్టే. ఎవరి ఎకౌంటులో ఎంతుందో వేసినవాళ్ళకు తప్ప బయటివాళ్ళకు తెలియదు.

ఉదయం ఆఫీసుకెళ్ళగానే ఆఫీసరు పిలచి, "సూర్యనారాయణ కాన్ఫిడెన్షియల్ ఫైలు తీసుకురండి" అన్నాడు. అదివిన్న వసంతరావుకి దేనికి నాందియో అర్థం కాలేదు.

"టెండరు ఫైలు చేయడం మీద వచ్చిన ఆరోపణలపై సూర్యనారాయణ ఇచ్చిన సంజాయిషీ సరిగ్గా లేదని చార్జి మెమో ఒకటి తయారు చేయండి." ఈ విషయం చెప్పేటప్పుడు ఆఫీసరు మృత్యుంజయ శాస్త్రి ముఖం చాలా సీరియస్‌గా ఉంది. "అరగంటలో చార్జి మెమో ఇష్యూ కావాలి."

"చూడు గురూ ఎంత అన్యాయంగా మెమో ఇచ్చేడో!" వసంతరావుని బలవంతంగా కేంటీనుకు తీసుకెళ్ళి తన గోడు వినిపించడం మొదలుపెట్టాడు సూర్యనారాయణ.

"ఆఫీసరు గారితో గొడవేమైనా పడ్డావా?" వర్షం టేజీల దగ్గర ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలున్న విషయం తెలిసిన వసంతరావు అడిగాడు.

అదికాదు గురూ. పోయినసారి వనభోజనాలకు ఒక్కొక్కరికి వంద రూపాయలు వసూలు చేశాడు. ఆ చందా గోపాలకృష్ణ శాస్త్రిగాడు. అంతెందుకౌతుందని ఈసారి ఈ లంపటాన్ని నేను నెత్తికెత్తుకున్నా. ఒక్కొక్కరికి డెబ్బై రూపాయలు మిగిలాయి. కానీ నాకు మాత్రం ఈ మెమో చేతికొచ్చింది."


"అన్నిరకాల మనుష్యుల మధ్య ఐక్యత పెంచడానికి వనభోజనాలు నిర్వహిస్తారని చెప్పేవాడివి కదా?" తన స్వభావానికి విరుద్ధంగానే చురకవేశాడు వసంతరావు.

"నిన్నటి వరకూ నేను అలానే అనుకొన్నాను గురూ. అదే నాకొంప ముంచింది. మన ఎల్‌డిసి సత్యం లేడూ... వాడే ఎస్‌సి కేండేట్టు. వడ్డించడానికి సరదాపడితే ఎంతైనా గుమస్తా కదా అని ప్రోత్సహించాను. బాసు అక్కడ బాగానే ఉన్నాడు. కాని తెల్లారకుండా నాకీ తద్దినం పెట్టాడు. ఏం చేయాలో తోచడం లేదు." లంచాల దగ్గర తప్పించి మిగిలిన అన్నిచోట్ల అభ్యుదయంగా ఉండే సూర్యనారాయణ అన్నాడు.

"వంటెవరితో చేయించావు?" ఉదయం నుంచి చెవిన పడిన ఫీడింగుతో ప్రశ్నించాడు వసంతరావు.

"గతంలో హోటల్లో పనిచేసి ప్రస్తుతం పెళ్ళిళ్ళకు వంటలు చేస్తున్న కుక్. మంచి పేరున్న వంటగాడే. ఎందుకొచ్చింది అనుమానం? గురుడేమన్నా అన్నాడా??"

"నీవు వంట చేయించింది వంట బ్రాహ్మణుడి తోనేనా?"



"కుక్‌కి కులంతో పనేమిటి? అయినా అతను చాలా మంచి కుక్.... ఇప్పుడు గుర్తుకు వచ్చింది. అతడు నాన్‌వెజ్ కూడా చేస్తాడు... కొంప మునిగింది గురూ."

"సంకర కూడు తిన్న తరువాత ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. దానికి ఖర్చుంటుంది. మీరూ మీరూ చూసుకోండి." వసంతరావు ఎవరి దగ్గర డబ్బులు తీసుకోడు. అలా అని ఎవరి పర్సంటేజీలకు అడ్డు పడడు.

ఈ విషయాలు చూస్తుంటే వనభోజనాలు వ్యాపారం, అమానుషం అని చూపించి, వాటి బారి పడకుండా ఆదిలోనే అడ్డుపడిన స్టాలిన్ చౌదరి, వందెపు రామారావులు జ్ఞాపకం వచ్చేరు.

* * * *

వసంతరావు కాలేజీ చదివే రోజుల్లో అతను హాస్టల్‌లో ఉండి చదువుకొనేవాడు. హాస్టల్‌లో రోజూ కాకపోయినా వారానికొక్కసారైనా చతుర్వేద పారాయణం జరుగుతుండేది. వేద పారాయణంలో వసంతరావు అగ్రగామి.

## కమల్ కబుర్లు!



'ఏం మనిషండీ ఆయన! అంటూ కమల్ మీద కోపం చూపించింది రేణుకా సహాని. కమల్ నిర్మించబోయే ఓ చిత్రంలో ఆమెకు ఆఫర్ ఇచ్చాడు. అయితే రెమ్యునరేషన్ చాలా తక్కువ ఇస్తానన్నాడట. దాంతో రేణుకకు వళ్లు మండిందట. ఏం మనిషండీ ఆయన! అయినా ఓ ఆర్టిస్టే తీసేది కమర్షియల్ చిత్రం. ఎందుకీ వివక్ష? మాకేమన్నా 'ఫేం' తక్కువా అందిట. ఆ చిత్రంలో చెయ్యనని స్టేట్‌మెంట్ ఇచ్చేసింది. క్లినికల్ సైకాలజీలో పట్టా పొందిన ఈమెకు 'సినిమా సైకాలజీ' ఇంకా వంటబట్టలేదని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

—రఘు

...ంతరావుకి ఆశయాలన్నా, ఆశయాలతో నడిచే సంఘాలన్నా చాలా ఫాసినేషన్. అభ్యుదయ సంఘాలలో పనిచేయడానికి తీరిక లేకపోవడం వల్ల అందులోకి వెళ్ళలేకపోయాడు కాని ఎవరైనా వాటిని విమర్శించితే మటుకు చీల్చి చెండాడేవాడు.

భౌతికవాద పునాదుల మీద నడిచే ఒక జాతీయ విద్యార్థి సంఘం కాలేజి విద్యార్థుల సంఘీభావంలో భాగంగా వనభోజనాలు నిర్వహించారు. ఈ వనభోజనాలు ప్రముఖ విద్యార్థి నాయకుడు స్టాలిన్ చౌదరి నాయకత్వంలో ఘనంగా జరిగాయి.

అభ్యుదయాన్ని చూపెట్టడానికనుకొంటాను ఒక ఉసిరి చెట్టును ముక్కముక్కలుగా నరికి తోటలో ఉన్న అన్ని చెట్లకు అంటుకట్టినట్టు కట్టేరు. ఆ తోటలో ఉన్న రెండు పెద్దచెట్ల క్రింద బరకాలు వేసి పేకాట ఆడడానికి రమ్మని అందర్నీ ఆహ్వానించారు.

"వసంతరావు పేకకాయలు వసూలు చేయడం నీవే చూడాలి. మన ఒక్కొక్కళ్ళ దగ్గర చాలా తక్కువ వసూలు చేశాం. మిగిలిన ఖర్చుకు పేకకాయల మీదే రావాలి" అని వసంతరావును ప్రక్కకు పిలిచి గురుతరమైన బాధ్యత పెట్టాడు స్టాలిన్ చౌదరి (పేకాట ఆడేవాళ్ళ దగ్గర ఆటకు ఇంత అని పేకాట క్లబ్బుల్లో వసూలు చేసే డబ్బులను పేకకాయలంటారు).

ఫకు పేకాటల గురించి పేకకాయల మీద నడిచే వనభోజనాల గురించి వసంతరావుకి తెలుసు. అవి వ్యాపార సరళిలో నడుస్తాయి. "అయితే వాటికి ఈ విద్యార్థి సంఘం నడిపే వనభోజనాలకు తేడా ఏమిటి?" 'బ్రాహ్మడు-మేక' కథలో బ్రాహ్మణుడికి మూడవ దొంగ దగ్గర వచ్చిన లాంటి అనుమానం వసంతరావుకి కల్గింది.

వసంతరావు కాలేజి చదువుకి గవర్నమెంటు ఉద్యోగానికి మధ్య ఓ అయిదు సంవత్సరాల ఖాళీ ఉంది. ఆ టైములో ప్రముఖ వ్యాపారవేత్త సందెపు రామారావు దగ్గర గుమస్తా-కం-చంచా ఉద్యోగం చేశాడు. ఆ కాలంలోనే వనభోజనాల నాణెం రెండోవైపు ఎక్కువగా చూడడం జరిగింది.

సాధారణంగా ప్రజల వనభోజనాల ఉద్యమం ఉదయం మొదలై సాయంత్రానికి అయిపోతుంది. కానీ వ్యాపార సంస్థల యజమానులు నిర్వహించే వనభోజనాలు కాదు వనవిలాసాలు శనివారం రాత్రి మొదలౌతాయి. ఆ వనవిలాసాలలో సంసార స్త్రీలకు ప్రవేశ అర్హత ఉండదు. ఆ రాత్రికి అవి ఆరుబయట ఖరీదైన పేకాట క్లబ్బులా విలసిల్లుతాయి. మద్యం నీరులా ప్రవహిస్తుంది.

ఆ రోజుల్లో మేజువాణీలు నిషేధించలేదు. వనభోజనాలు నిర్వహించే వారి స్థాయిని బట్టి అందులో పాల్గొనే వేశ్యల బృందాలు ఉండేవి. కార్తీకమాసం మొదలౌతుందంటేనే పెద్దాపురం చుట్టుప్రక్కల కంపెనీల ఓనర్లు బుకింగుల గురించి రాజమండ్రి లాడ్జిలలో మకాం వేసేవారు (కోస్తా జిల్లాలలో వేశ్యాగృహాలను కంపెనీలు అంటారు).

రాజమండ్రిలోని మేరీ కంపెనీ, బేబీ కంపెనీ, ధవళేశ్వరంలో సంతులు కంపెనీలకు బోలెడంత డిమాండు.

ఇలాంటి వనభోజనాలు ఊరికి దూరంగా ప్రైవేటు గార్డెన్స్‌లో నిర్వహించేవారు. మొరలమ్మేది శనివారం రాత్రి అయినా అన్నిరకాల మాంసాహారం తయారు చేయించేవారు. పేకాటలు ఆడుకోవటానికి చెట్టుకి నాలుగైదు ట్యూబ్‌లైట్లు, చెట్ల క్రింద బరకాలు, పరుపులు ఒకటేమిటి అన్నిరకాల హంగులు ఉండేవి.

వసంతరావు బాస్ బంగారు వర్తకుల సంఘానికి, ఐరన్ అండ్ హార్డ్‌వేర్ సంఘాలకి అధ్యక్షుడు. ఇంకా చాలా చిన్న సంఘాలకు గౌరవాధ్యక్షుడు. ముఖ్యంగా పోలీసు అధికారులకు ఆప్తుడు. అతని ఆధ్వర్యంలో జరిగే వనభోజనాలకి రావడానికి చాలామంది పోటీపడతారు. ఇంద్రలోకాన్ని మరపించే ఆ వనవిలాసాలకి రావడానికి అర్హత మాత్రం కొంతమందికే దక్కుతుంది. ఆ మొత్తం నిర్వహణలో స్టోర్‌కీపర్ పాత్ర వసంతరావుది.

తోటలో మోటారు బావి దగ్గర చెట్లక్రింద పెద్ద రేకుల షెడ్డు. అది పర్మనెంట్ కట్టడం. దానిప్రక్కన వంటలు చేయడానికి, పనివాళ్ళు ఉండడానికి తాత్కాలికంగా ఒక పాక వేసేవాళ్ళు. రేకుల షెడ్డు, అందులో ఉన్న ఒక గది వసంతరావు ఆధీనంలో ఉండేవి.

మేజువాణీకి వచ్చిన మహిళలు వారికి సంబంధించిన సూట్‌కేసులు, ఇతర అలంకరణ సామ... ఆ షెడ్డులోనే పెట్టేవాళ్ళు. వాళ్ళ సామానుల వరకు చూడడానికి పెద్ద ఇబ్బంది పడేవాడు కాదు వసంతరావు. ఆ మహిళలతోపాటు వచ్చిన చిన్న పిల్లలను ఆ షెడ్డులోనే పడుకోబెట్టి వెళ్ళేవాళ్ళు. ఒకప్రక్క దోమలు, రెండవ ప్రక్క సంపన్న నాగరీకులు చేసే ఆటవిక విన్యాసాలు, అరుపులు ఆ పిల్లలను కంటినిండా నిద్రపోనిచ్చేవి కావు. ఆ చిన్నారులు నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి వేసే ప్రశ్నలు వసంతరావు గుండెను మెలిపెడుతుండేవి.

"ఏమండోయ్ వసంతరావుగారూ మా పిల్లలను జాగ్రత్తగా చూడండి. ఊరిగే వద్దులే మీకు కావలసిందిస్తాము". అని కన్నుగీటి వెళ్ళిపోయే వనజ లాంటి వాళ్ళ మాటలు ఇంకా బాధ పెట్టేవి. తన బిడ్డ భద్రత గురించి శరీరాన్ని పణంగా పెట్టడం వాళ్ళకు ఎలాగూ అలవాటైపోయింది. కానీ ఆ మాటలు భరించడానికి మాత్రం వసంతరావుకి చేదు మింగినంత వికారంగా ఉండేవి. ఆ షెడ్లో కలత నిద్రలు పోతున్న పిల్లలను చూస్తుంటే బ్రాయిలర్ కోడిపిల్లలే కళ్ళముందు కదలాడేవి.

రాత్రి లేదు, పగలు లేదు వసంతరావు కూర్చున్న దగ్గర నుంచి చూస్తే, చెట్లక్రింద కూర్చుని ఎంతో దీక్షతో ఒకచేత్తో పేకాడుతూ రెండవ చేత్తో గ్లాసులో మందును చిద్విలాసంగా సిప్ చేస్తున్న మగమహారాజులు. వారిమధ్య ఖరీదైన చీరలలో చెదిరిపోయిన మేకప్పులతో కావలసిన వారికి సిగరెట్లు వెలిగించి ఇవ్వడం, అయిపోయిన మందుగ్లాసులను నింపి తీసుకెళ్ళే స్త్రీలు. మగవాళ్ళు వేసే అసభ్యకర జోకులను, వెకిలి చేష్టలను భరిస్తూ నవ్వును నటించడం శాపగ్రస్తమైన జీవితం ఆ స్త్రీలకే చెల్లింది.

లాంగ్‌షాటులో చూస్తే అదంతా ఇంద్రలోకం లాగానే ఉంటుంది. ఫిష్ ఐలెన్స్ వేసి చూస్తేనే పేదవాళ్ళు, సేవకులు, తండ్రెవడో తెలియదు. తెలిసిన తల్లి పొట్టకూటి గురించి దూరంగా చిందులేస్తుంటే, ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసే పిల్లలు కనిపిస్తారు. ఇంద్రలోకంలో అయితే ఈ బాధలన్నీ మంత్రాలతో మాయం చేస్తారేమో అనుకునే వాడు వసంతరావు. చిన్న వయసులోనే ఈ విపరీతమైన కంట్రాస్టు చూసి వసంతరావు సిద్ధార్థుడవ్వలేదు. కానీ వనభోజనాలు మంచివని చెప్పేవారిని చూసి జాలిగా నవ్వేస్థాయికి చేరుకున్నాడు.

వీటిటన్నిటినీ మించి వనభోజనాల పట్ల వసంతరావు మనసులో అంతర్లీనంగా గూఢమైన వ్యతిరేకత ఉండేది. అదెందుకో అతనికి స్పష్టంగా తెలిసేది కాదు. ఈ విషయం గురించి ఒక మారుమూల పల్లెటూళ్ళో జ్ఞానోదయం అవుతుందని అతనెప్పుడూ అనుకోలేదు.

* * * *

వసంతరావు మేనత్త వెనుకటి రోజుల్లోనే సెకండరీ గ్రేడు ట్రయినింగు పాసై పాయకరావుపేట దగ్గర నక్కపల్లి మండల పరిషత్తులో టీచరుగా

పనిచేస్తోంది. వాళ్ళాయన కూడా టీచరే. చాలా సంవత్సరాల తరువాత ఆమె దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

చిరంజీవి వసంతరావును ప్రభువు కృపతో దీవించి వ్రాయునది,

ఇక్కడ ప్రభువు దయవల్ల అందరూ క్షేమమే. మీరు కూడా ఆ దయామయుని కృప వల్ల క్షేమ మని తలుస్తాను. ప్రభువు చిత్తానుసారం ఇక్కడ మూడు రోజులు స్వస్థత కూటాలు నిర్వహించా లని తలపెట్టాము. మీ మామయ్య ఆరోగ్యం బాగా లేనందున ఎక్కడి పనులు అక్కడే ఆగి పోయినాయి. ఇక్కడి పనుల్లో సహాయము చేసి ప్రభువు కృప పొందు నిమిత్తం వచ్చే సోమవారం నుంచి నాలుగు రోజులు ఆఫీసుకు సెలవు పెట్టి రావలసింది. మీ కుటుంబ క్షేమం గురించి రోజూ ప్రార్థనలో ప్రభువును వేడుకొనుచున్నాను.

ఇట్లు
మీ మేనత్త, ప్రభువు సేవకురాలు
అనంత వరలక్ష్మి

వసంతరావు గవర్నమెంటు ఉద్యోగంలోకి వచ్చాక చాలా రకాల డ్యూటీలు చేశాడుగానీ ఇలాంటి డ్యూటీ చేయలేదు. వెరైటీగా ఉంటుందని అరట్ల కోట బయలుదేరాడు.

వసంతరావు మేనత్త సర్టిఫికెట్లలో పేరును మార్చు కోవడం కష్టమని పేరు మార్చుకోలేదని చెబుతుంది. కాని మతం మార్చుకుంది. మతం మార్చు కున్న దగ్గర నుంచి హిందూ దేవుళ్ళు అన్యులు, సైతాను అంత కలిగినవాళ్ళు అయిపోయారు. ఆమె హిందూ మతాన్ని వదిలేసిందిగాని హిందూ కులాన్ని వదల్లేదు.

కేరళ మినహా దక్షిణాది రాష్ట్రాలలో క్రైస్త వులంటే అంటరాని వారనే ఆమోదయోగ్యమైన ముద్ర ఉంది. పట్టణాలలో అయితే క్రైస్తవులు శ్వేతవస్త్ర దళితులేమోకాని పల్లెటూళ్ళో పూర్తిగా అంటరానివారే. అందుకని వసంతరావు మేనత్త మాటికి మాటయాభై శాతం క్రైస్తవరాలైనా అంట రాని తనాన్ని తప్పించుకుంటానని తన కులాన్ని మాత్రం చెప్పకుంటుంది. ఆమె మాట్లాడే ప్రతి మొదటి వాక్యంలోనూ తాను కాపు కులానికి చెంది నదానినని, ప్రభువునందు విశ్వాసముంచడం వల్ల క్రైస్తవ మతం పుచ్చుకున్నానని చెప్పకుండా ఉండదు.

"సువార్త ప్రచారం చేయడానికి కార్తీక మాసం చాలామంచిదని తన ముప్పైఏళ్ళ సర్వీసులో తెలు సుకున్నాను" అని వరలక్ష్మి, వసంతరావుతో చాలా గొప్పగా చెప్పింది.

"అప్పుడు కార్తీక మాసం అనడం మాని, క్రైస్తవ మాసం అని పేరు మారిస్తే పోలా?"

"ఎప్పుడూ నీకు వేళాకోళమే. పరిశుద్ధుడైన ప్రభువు విషయంలో అలా వేళాకోళం చేయకూడదు" అని చాలా కోపంగా చెప్పి, వసంతరావు తప్పును క్షమించమని వెంటనే చిన్న ప్రార్థన చేసింది.

పందిరి వేయడానికి, చిన్న చిన్న పనులు చేయడా నికి కూడా చాలామంది జనం ఉన్నారు. అందరూ వ్యవసాయ కూలీల్లాగే కనపడుతున్నారు. పేదరికం, వెనుకబాటుతనం వారి వేష భాషల్లో వ్యక్తమౌతూనే ఉంది.

"ఈ పనులు చేయడానికి నలుగురు సరిపో తారు కదా? ఇంతమంది ఎందుకిక్కడ మిగిలిన వాళ్ళు వెళ్ళి వాళ్ళ పనులు చూసుకోవచ్చు కదా??" మేనత్త కుడిభుజమైన యాకోబును అడిగాడు వసంతరావు.

"కార్తీక మాసం గదండీ ఓలుకు పనులుం టాయి? కూలి పనులుంటే ఒరన్న ఇక్కడుంటారేటి లగెత్తుకుపోరూ" అన్నాడు తెల్లమీసాల యాకోబు.

"కార్తీక మాసంలో కూలి పనులు లేకపోవడమే మిటి? అప్పడేం చేస్తారు మీరంతా??"

"ఏటి నీకు తెలీకే అడుగుతున్నావా? ఊడు పులు, కలుపులు అయిపోనాయి, మరి కోతల వరకు పనులేటుంటాయి? మామేటి చేత్తాము? పత్తులుంటమే. ఒరన్నా ఈ కాలంలో బస్తా ధాన్యం ఇస్తే పంటలకి రెండు బస్తాల ధాన్యం కొలవాల ఆళ్ళకి. అలగైనా ఇచ్చేవాళ్ళు లేక చాలామంది వలసెల్లి పోనారు" వసంతరావుకి భయంకరంగా అనిపించిన విషయాలను చాలా మామూలుగా చెప్పేడు యాకోబు.

వసంతరావు మేనత్త చాలా. తెలివైంది. ప్రతి సంవత్సరం నాలుగు బస్తాల బియ్యం కొనేది. కార్తీక మాసంలో ప్రతివారం కూటం పెట్టేది. కూటానికి వచ్చిన వాళ్ళకు సేరు బియ్యం ఇచ్చి దానకర్ణుడి లెవెల్లో పేరు సంపాదించింది. కరువులో ఆదు కుంటుందన్న గొప్పదనం దక్కింది. అంతేకాక సువార్త ప్రచారకురాలుగా పేరు దేశ పొలిమేరలు దాటింది. అందులో భాగంగానే ఈ భక్తికూటాల నిర్వహణ. విదేశాల నుంచి వచ్చిన మిషనరీ లు మూడురోజులు ఇక్కడే ఉన్నారు.

వసంతరావు అక్కడున్న నాలుగు రోజుల్లో చాలా విషయాలు అర్థమయ్యాయి. మేనత్త అవ కాశవాదం, స్వార్థపూరిత చింతన చాలా దగ్గర నుంచి చూశాడు. అయినా ఇందులో ఎదుటి వారిని బాధపెట్టే విషయాలు లేవు గాబట్టి ఆమెను క్షమించగలిగాడు వసంతరావు.

చదివిన ఒక పుస్తకాన్ని చాలాకాలంతరువాత చదివితే అప్పుడు అర్థమయ్యే లోతులు వేరుగా ఉంటాయి. కార్తీక మాసంలో కూలీలు పడే పాట్ల గురించి యాకోబు చెప్పిన విషయాలు ఇంతకుముం దైతే విని అయ్యోపాపం అనేవాడు వసంతరావు. కాని ఈ విషయాన్నే వనభోజనాలతో జోడించి ఆలోచిస్తే చాలా పాశవికంగా కనపడుతున్నాయి.

పిల్లవాడు ఐస్‌ఫ్రూట్ కొనుక్కొని తినేటప్పుడు పొందే ఆనందం కంటే ఐస్‌ఫ్రూట్ కొనుక్కోలేని వాడిముందు తింటే ఎక్కువ ఆనందపడతాడు. మారుమూల గ్రామమైన అరట్లకోటలోవసంతరావుని చాలా సంవత్సరాలుగా వెంటాడుతున్న కార్తీక మాసం–వనభోజనాల అబ్‌సెషన్‌కి ఆధారం దొరి కింది. ●


రేడియో సైజు కలర్ టి.వి.
★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
కేవలం రూ. 300/–లకే ఆకర్షణీయమైన
జపాన్ మోడల్ 8 సం.లు గ్యారంటీ
మా స్కీముద్వారా కేవలం రూ. 300/–లకే
లభ్యం. పోస్టేజి అదనం.
AJAY TRADING COMPANY (A)
P.O. LALBIGHA (GAYA)
ఆటోమెటిక్ టాయ్ రివాల్వర్

50 షాట్లు ఉచితం

MARSHAL ZORO
RS. 175/-
పోస్టల్ ఛార్జీలు అదనం
BULLET ZORO
RS. 270/-
పోస్టల్ ఛార్జీలు అదనం
★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
★ లైసెన్స్ అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మరక్షణ కొరకు
మార్షల్ జోరో మరియు బుల్లెట్ జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణనిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు, ప్రయాణాలలో మరియు జంతువుల బారి నుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ ప్రేలే తుపాకి. వెంటనే మీ ఆర్డర్లను పంపించండి.
JANTA TRADERS (J)
P.O. LALBIGHA (GAYA)